క్లుప్తంగా

ఇద్దరి రిమాండ్

కమలాపూర్ : మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన పూజారి రాజు, పూజారి సుభాష్‌ను పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని అంబాల, శ్రీరాములపల్లిలో ఈనెల 5వ తేదీ రాత్రి పందుల పెంపకం, అమ్మకం విషయంలో ఇరువర్గాలు గొడవపడి కర్రలు, కత్తులతో పరస్పర దాడులకు పాల్పడి ఇరు వర్గాలూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో పూజారి రాజు, పూజారి సుభాష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అనవసర విషయాల్లో తలదూర్చి జైలుపాలు కావొద్దని సూచించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరామర్శలు..



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముత్తారం మాజీ సర్పంచ్ ఏనుగు ఈశ్వర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హన్మకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ జక్కుల అనిత రమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ కళాకారుడు భాను ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నియామకం..



పరకాల: ఎస్ఎస్‌యూఐ పరకాల అసెంబ్లీ కన్వీనర్‌గా ఏకు అభిలాష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి, సహకరించిన నాయకులకు అభిలాష్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తానని అభిలాష్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


దామెర: మండలంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నెలవారి మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విరాళం అందజేత




ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండల కేంద్రంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి శుక్రవారం రూ.20వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల చరిత్ర, అనుసరించిన విధానాలు, వారు చూపెట్టిన మార్గదర్శకాలు నేటి తరం యువకులకు ఎంతో అవసరమన్నారు. విరాళం అందించిన ఆమెను అంబేడ్కర్ సంఘం నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమురయ్య, నాయకులు నాగరాజు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



భిక్షపతి



తిరుపతి

కమలాపూర్ : మండలంలోని శ్రీ కంఠమహేశ్వర కళామండలి నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండ భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా దూలం తిరుపతి, ఉపాధ్యక్షులుగా పబ్బు ఓదెలు, తాళ్లపెల్లి ఓదెలు, కోశాధికారిగా పచ్చిమట్ల రాజేష్, గౌరవ అధ్యక్షుడిగా పబ్బు సతీష్, కార్యవర్గ సభ్యులుగా మండ కుమారస్వామి, బాలసారి కుమారస్వామి, పబ్బు వీరగౌడ్, శ్రీనివాస్, పబ్బు మల్లేష్‌లను ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆందోళనలతోనే హక్కుల సాధన



పట్టణంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

పరకాల: ఆందోళనలతోనే హక్కులు సాధింపు సాధ్యమవుతుందని యూఎస్‌పీసీ డివిజనల్ బాధ్యులు మేరుగు ప్రసన్న, రాజారం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టే ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో యూఎస్‌పీసీ డిమాండ్ల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిటీ వేయాలనీ, జూలై 1 నుంచి ఐఆర్ మంజూరు చేయాలని కోరారు. కొత్త నియామకాలతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత హామీలను విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటికీ ఆమోదం తెలుపాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిర్వహించతలపెట్టిన మహాధర్నా కార్యక్రమంలో ప్రతీఒక్క ఉపాధ్యాయుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు విశ్వనాథం, భిక్షపతి, రాజమౌళి, శశికళాధర్, సారయ్య, రాజయ్య, శ్రీలత, స్వప్న, శ్రీనాథ్, శంకర్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బీమా పాలసీ కలిగి ఉండాలి



వీరస్వామిని సన్మానిస్తున్న మేనేజర్ విశ్వనాథం

శాయంపేట : ప్రతిఒక్కరూ బీమా పాలసీ పొంది ఉండాలని పరకాల ఎల్‌ఐసీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ టి యం విశ్వనాధన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఎల్‌ఐసీ డైరెక్ట్ ఏజెంట్లకు వృత్తి శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎల్‌ఐసీ విడుదల చేసిన కొత్త పాలసీలపై భూపాలపల్లి ఎస్ఓ మేనేజర్ ప్రశాంత్ కుమార్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. సింగిల్ ప్రీమియం పాలసీలతో అధిక లాభాలను పొందవచ్చని సూచించారు. బ్రాంచ్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏజెంట్లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు దేశిని రాజేశంగౌడ్, ఆకుల రవీందర్, కోమటి వీరస్వామి, బాబు, శ్రీనివాస్, కుమారస్వామి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు సన్మానం

హసన్‌పర్తి: దేశ సరిహద్దులో విధులు నిర్వహించిన జవాన్లను ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మేరీ మిట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ డివిజన్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలో జవాన్లు వెంగళ శ్రీనివాస్, టీకుల నాగరాజును శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, తాళ్ల రమేష్, దాసరి రాజు, పోతరాజు ప్రభాకర్ పాల్గొన్నారు.

‘కుష్టు’ నిర్మూలనకు కృషిచేయాలి



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

కరీమాబాద్ : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతిఒక్కరిని పరీక్షించి, వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి తక్షణమే చికిత్స అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు వైద్య శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పరీక్షిస్తారని తెలిపారు. అనంతరం కుష్టు నిర్మూలన కార్యక్రమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. నోడల్ అధికారి డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డీడబ్ల్యూఓ శారద, సీడీపీఓ విశ్వజ, త్రీనాస్ బాబ్జి, అనుపమ, అనిల్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

పరకాల: పట్టణంలోని దామెరచెరువు నాలాను అక్రమించిన వారిని కాకుండా తమ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం అన్యాయమని, వెంటనే చర్య తీసుకోవాలని పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోవు రాజయ్య రెవెన్యూ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. 334, 335 సర్వే నంబర్‌లో పట్టా, రిజిస్ట్రేషన్స్ కలిగి ఉన్న తన 4 గుంటల భూమిలో దామెర చెరువు మత్తడి నాలా పనులు చేపట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారు. నాలాపై అక్రమంగా నిర్మాణం చేసిన ఇళ్లను కూల్చి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా ‘లైబ్రేరియన్‌డే’

దేశాయిపేట: డాక్టర్ రంగనాథన్ 131వ జయంతిని పురస్కరించుకొని వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ‘లైబ్రేరియన్ డే’ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పొలడుగుల నిఖితకు ‘యువ రచయిత అవార్డు’, సంగరబోయిన మేఘన, లిఖిత, మహేష్, దిలీప్ అనే విద్యార్థులకు ‘ఉత్తమ గ్రంథాలయ వినియోగదారుల అవార్డు’ను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ జీ.శశిధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి, గ్రంథ పాలకులు అనిల్‌కుమార్, విశ్రాంత అధ్యాపకులు వెంకటేశ్వరరావు, జానకీరామయ్య, నర్సింహారెడ్డి, శ్రీరాములు, మోహనరావు, కెప్టెన్ సతీష్‌కుమార్, కరుణాకర్, రాజేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండి ఆదుకుంటా



నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

వరంగల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్ కాలనీలో ముంపునకు గురైన బాధితులకు అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ స్వయంగా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన, నాయకులు ముడుసు నర్సింహ, పసులాది మల్లయ్య, తూర్పాటి సారయ్య, పత్రి సుభాష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

హసన్‌పర్తి: రెండవ డివిజన్ వంగపహాడ్‌కు చెందిన మార్త వినోదకు సీఎంఆర్ఎఫ్ చెక్కును హనుమకొండలోని తన స్వగృహంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం అందజేశారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ఎంఈఓ రామకిషన్‌రాజు

విద్యారణ్యపురి: ఈనెల 22, 23 తేదీల్లో హనుమకొండ, కాజీపేట మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ రామకిషన్‌రాజు తెలిపారు. ఈ మేరకు పీడీ, పీఈటీలతో ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలు క్రీడలు నిర్వహించాలని చర్చించి నిర్ణయించారు. ఖోఖో, కబడ్డీ పోటీలను ప్రతి పాఠశాల నుంచి నలుగురు చొప్పున, వాలీబాల్ పోటీలకు ముగ్గురు చొప్పున విద్యార్థులను పంపాలని ఆదేశించారు. అండర్ -14కు 6, 7, 8తరగతులు, అండర్ -17కు 9, 10 తరగతుల విద్యార్థులు ఆయా క్రీడాపోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. హనుమకొండ మండల విద్యార్థులకు ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో, కాజీపేట మండలాల విద్యార్థులకు కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లో క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ప్రతీ పాఠశాలలోని ఉపాధ్యాయులు తమ విద్యార్థుల ప్రతిభను గుర్తించి పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ రాజేందర్, కాజీపేట ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ సదానందం పాల్గొన్నారు.


ఉపాధి కల్పనకు శిక్షణ తరగతులు దోహదం



విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ఉపాధి కల్పన శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతాయని, వాటిని సద్వినియోగించుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి సూచించారు. శుక్రవారం శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారంపాటు కళాశాలలోని విద్యార్థులకు ఉపాధి కల్పన శిక్షణ తరగతులు నిర్వహించారని వివరించారు. విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారని చెప్పారు. విద్యార్థులకు త్వరలోనే రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి వివిధ కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రమ, శిక్షణ శిబిరం కోఆర్డినేటర్లు కిరణ్, రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ యాకయ్య, రజనీకుమార్ పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో ‘పునీత్ సాగర్’



నేలకూలిన చెట్టును తొలగిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు కళాశాలలో కూలిపోయిన ఎత్తైన వృక్షాలు, పెద్దఎత్తున పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఎన్‌సీసీ కేడెట్లు తొలగించినట్లు వివరించారు. కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, శశాంక్, విష్ణు, అక్షయ్, నేహశ్రీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు వచ్చేశాయ్..



మండల కేంద్రానికి చేరుకున్న స్పోర్ట్స్ కిట్లు

శాయంపేట : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే నెలలో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించిన విషయం తెలిసిందే. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్ కిట్లు, వాలీబాల్, డిస్కుత్రో, నెట్, సైకిల్ పంపు, డంబెల్స్, టెన్నీకాయిట్, రింగ్, స్కిప్పింగ్ రోప్, స్టాప్ వాచ్‌లతో కూడిన 27 కిట్లతో పాటు 2025 టీషర్టులు అందించగా వాటిని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచారు. ఈనె 15వ తేదీన జరిగే స్వతంత్ర్య దినోత్సవం రోజున క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

తహసీల్దార్‌కు అభినందన



పూలబొకే అందజేస్తున్న రేషన్ డీలర్లు

శాయంపేట : మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సుభాషిణిని శుక్రవారం రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఆమెకు స్వాగతం పలికారు. సమస్యలుంటే చెప్పాలని ఆమె కోరారు. అదే విధంగా జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు అమ్మ అశోక్, దానబోయిన అశోక్, బాబురావు, ప్రకాశం, అల్లాఉద్దీన్, అమరేందర్‌రెడ్డి, అనూష, కృష్ణమూర్తి, రవీందర్ తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యం



జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి: నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇంధిరానగర్‌లో రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని అన్నారు. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు, నూతన జీపీ భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూర్గుల రామారావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న వైద్య సిబ్బంది

కమలాపూర్ : నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగిని రెగ్యులరైజ్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్‌పాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్ఎం జ్యోతి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రాణాలకు తెగించి ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉన్నామని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎటువంటి రాత పరీక్షలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆరోగ్య భద్రత కల్పించాలని, వైద్యుల మాదిరిగానే వెయిటేజ్ ఇచ్చి క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు ప్రమీల, సరిత, సమీరా, ల్యాబ్ టెక్నీషియన్ కాపర్తి చంద్రమౌళి, ఈసీ ఏఎన్ఎం మల్లమ్మ, లావణ్య, సంపూర్ణ, శశికళ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు డ్రై డే చేపట్టాలి



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

కమలాపూర్ : దోమల నివారణకు ప్రతీ శుక్రవారం డ్రై డే చేపట్టాలని ఎంపీడీఓ పల్లవి సూచించారు. మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి అధికారులతో ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రమ్ములు, టైర్లు, ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే వాటిలో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుందని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పద్మశాలీలకు రాజకీయంగా అవకాశం ఇవ్వాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి: పద్మశాలీలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లను కేటాయించి రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఇవ్వాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చంద మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సూరారం గ్రామంలో శుక్రవారం చలో కోరుట్ల బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పార్టీ నుంచి పద్మశాలీలకు అధిక మొత్తంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ సీట్లను కేటాయించాలన్నారు. పద్మశాలీలకు రాజకీయంగా ఎదిగే అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందుకోసం ఈనెల 13వ తేదీన కోరుట్ల పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభకుజిల్లాలోని పద్మశాలిలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుడిమల కృష్ణారావు, వలపదాసు, శ్యాంసుందర్, మురళీకృష్ణ, సుధాకర్, సతీష్, నరసింహస్వామి, వీరస్వామి, వివేకానంద, రత్నాకర్, రాజు, రమేష్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఆత్మీయ వీడ్కోలు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

దామెర: మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న మహ్మద్ రియాజుద్దీన్‌కు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించి, మెమెంటోను అందించారు. అనతరం రియాజుద్దీన్ మాట్లాడారు విధి నిర్వహణలో సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. ప్రతీ ఉద్యోగికి బదిలీ సహజమని, పనిచేసిన చోటా ప్రజలకు మంచి సేవలందిస్తే ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, సర్వేయర్ కవితారాణి, ఏఎస్ఓ హైమావతి, ధరణి ఆపరేటర్ సాగరిక, శైలజ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైనికుల సేవలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలి



మాజీ సైనికులను సన్మానిస్తున్న నాయకులు

కమలాపూర్ : దేశరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల సేవలను స్మరించుకోవాలని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా మట్టి నా దేశం కార్యక్రమం మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సైనికులు మాట్ల శ్రీనివాస్, బండి సంపత్‌లను ఘనంగా సన్మానించారు. దేశానికి సేవలందిస్తున్న సైనికుల గొప్పదనాన్ని పిల్లలకు వివరించాలని సూచించారు. దేశరక్షణలో భాగంగా ప్రాణాలర్పించిన వీరుల పోరాటపటిమను భావితరాలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశసరిహద్దుల్లో సైనికులు నిద్రహారాలు మానుకొని కాపుకాస్తేనే ప్రజలు ప్రశాంతంగా నిద్రిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో అమరవీరుల స్తూపం నిర్మాణం కోసం ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించి స్తూపాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. బీజేపీ జిల్లా అధికారప్రతినిధి తుమ్మ శోభన్ బాబు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్, మండల ప్రధానకార్యదర్శి భూపతి ప్రవీణ్, ఉపాధ్యక్షులు భిక్షపతి, సింగిల్ విండో డైరెక్టర్ మౌటం రమేష్‌బాబు, టౌన్ అధ్యక్షుడు నసాని రాజు, వార్డు సభ్యులు మౌటం శ్రీనివాస్, బండి కుమారస్వామి, మహంకాళి రమేష్, రాజేష్, పెండ్యాల తిరుపతిరెడ్డి, బండి సురేష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. కల్యాణ్ (S.R) : 8686236437 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)